క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మినీ లారీ డ్రైవర్ గాయపడ్డాడు. అందిన వివరాల మేరకు.. ఒంగోలు నుంచి విజయవాడ వైపు ఐషర్ మినీ లారీ వస్తోంది. జాతీయ రహదారిపై రాజుపాలెం తాతపూడి గ్రామాల మధ్య లారీ ముందు కోళ్లను తరలిస్తున్న ద్విచక్ర వాహనదారు హఠాత్తుగా బ్రేక్ వేసి తన వాహనాన్ని రహదారిపై ఆపాడు. దీంతో ఐషర్ డ్రైవర్ ఎస్ నరేందర్ తన లారీని సడన్ బ్రేక్ వేసి ఆపడంతో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయింది. ప్రమాద తీవ్రతకు నరేందర్ ఎడమ చేయి విరిగింది. సమాచారం అందుకున్న మార్టూరు 108 సిబ్బంది డ్రైవర్ నరేందర్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతు ఉత్పత్తుల సమాఖ్యలతో మేలు



మాట్లాడుతున్న చీరాల మత్స్యశాఖ సహాయ సంచాలకుడు క్రిష్టఫర్

అద్దంకి రూరల్: మత్స్య సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సమైఖ్యలుగా ఏర్పాటు చేసుకోవటం మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరమని చీరాల మత్యశాఖ సహాయ సంచాలకుడు బీ. క్రిష్టఫర్ అన్నారు. శుక్రవారం జిల్లా మత్యశాఖ ఆధ్వర్యంలో చక్రాయ పాలెంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రిష్టఫర్ మాట్లాడుతూ సంఘాలో ఉన్న చెరువుల ఉత్పత్తి పెంచటం, సంఘాలకు ఆదాయం సమకూరేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో మత్స్యసహాయ సంచాలకులు ఎం రవీంద్ర, సహకార సంఘ సభ్యులు, గ్రామ మత్స్య సహాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

చీరాల రూరల్: ఒంగోలు హెచ్‌సిజీఎంఎస్‌ఆర్ క్యాన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం చీరాల ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత కాన్సర్ వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు డాక్టర్ నాగళ్ల ప్రదీప్‌కుమార్‌రెడ్డి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్త్రీలలో రొమ్ము క్యాన్సర్ పురుషులలో పొగాకు వాడకం వలన వచ్చే అనేక రకాల క్యాన్సర్‌లను ముందుగానే గుర్తించి చికిత్సలు అందిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్టమాసం, ఉత్తరాభాద్ర నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నోటు పుస్తకాలు అందజేత

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా నోటు పుస్తకాలు అందించారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీహర్ష, దీపికల కుమార్తె అవిష జన్మదినం సందర్భంగా దాత విద్యార్థులకు నోటు పుస్తకాలను అందించినట్లు ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నదని చెప్పారు. దాతలు అందించిన సాయాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ అన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రిటైర్డు లైబ్రేరియన్ పుల్లగూర జయశీలరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదుకునే అంతర పంట

- అంతర పంటలతో అదనపు ఆదాయాలు
- వ్యవసాయాధికారి సలహాలు, సూచనలు



పీ.శ్రీనివాసరావు, ఏవో

మేదరమెట్ల: ప్రధాన పంటల కంటే ముందుగా చేతికి అందే పంటలను అంతర పంటలుగా వేసుకొని రైతులు అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. ఇలాంటి అంతర పంటలను సాగు చేసుకోవడం వలన అధిక ప్రయోజనాలు కలుగుతాయని అలాగే భూతాపం తగ్గేందుకు దోహదపడుతుందని వ్యవసాయాధికారి పీ.శ్రీనివాసరావు అంటున్నారు. ఎక్కువ పంట కాలం, ఎక్కువ ఎత్తు, తక్కువగా నీటిని తీసుకునే పంటల్లో తక్కువ పంటకాలం, తక్కువ ఎత్తులో ఉండే పంటలను అంతర్ పంటలుగా విత్తుకోవాలి. అలాగే ఎక్కువ పోషకాలు కలిగిన పంటలు, ఎక్కువ నీటి వినియోగం చేసుకునే పంటల్లో వేరు వ్యవస్థ లోతుగా ఉండే పంటల్లో తక్కువ లోతులో వేర్లు ఉండే పంటలను వేసుకోవడం వలన భూమికి మేలు చేయడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది.

అంతర పంటలుగా వేసుకోదగినవి..

- కంది పంటలో అంతర్ పంటలుగా జొన్న, రాగి, కొర్ర, పెసర, మినుము, బొబ్బర్లు, నేలచిక్కుడు, మొక్కజొన్న ఉలవలు, పత్తి పంటలను సాగు చేసుకోవచ్చు.
- జొన్న పంటలో రాగి, కొర్ర, వేరుశనగ, మినుము, ఉలవలు, నేలచిక్కుడు, బొబ్బర్లు అంతర్ పంటలుగా సాగుచేసుకోవచ్చు.



మొక్కజొన్న పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న కంది



మిరప పంటలో అంతర పంటగా బంతి సాగు

- కొర్ర పంటలో బొబ్బర్లు, మినుము, సోయాచిక్కుడు, వేరు శనగ పంటలను అంతర్ పంటలుగా విత్తుకోవచ్చు.
- బెండలో క్యారెట్, టమోట, కొత్తిమేర, గోంగూర, తొటకూర, క్యాబేజి, పాలకూర, క్యాలీఫ్లవర్‌ను అంతర్ పంటలుగా వేసుకోవచ్చు.
- వంగ పంటలో ఆకుకూరలు, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, ఉల్లి, వెల్లుల్లి పంటలను సాగు చేసుకోవచ్చు.
- మిరపలో ఆకుకూరలు, ఉల్లి మరియు వెల్లుల్లిని సాగు చేసుకోవచ్చు.

అంతర్ పంటలు వేసుకోవడం వలన ప్రయోజనాలు..

అంతర్‌పంటల సాగు ద్వారా భూతాపాన్ని తగ్గించడ, తేమను కాపాడటం, భూమి సారవంతంగా మారుతుంది. ప్రకృతి వైపరీత్యాలకు ఒక పంట నష్టపోయినా మరో పంట ఆదాయాన్ని ఇస్తాయి. వాతావరణం అనుకూలించి వేసిన పంటలకు మంచి దిగుబడులతో పాటు ఎక్కువ ధర ఉంటే రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుంది. ఒకే సమయంలో రెండు పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంటుంది. అంతర్ పంటలను సాగు చేసుకోవడం వలన ఒక పంటను ఆశించే పురుగులు మరో పంటపై వాలే కీటకాల వలన పురుగులు నిర్మూలన జరిగేందుకు అంతర్‌పంటలు ఎంతగానో దోహదపడతాయని రైతులు అంతర్ పంటలను సాగు చేసుకోవడం అలవరచుకోవాలని దీనివలన అటు ఆదాయం పెరగడంతోపాటు భూసారం పెంపొందుతుందని ఏవో సూచిస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అవసరం



యద్దనపూడిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న నిర్మల



తిమ్మాయిపాలెంలో విద్యార్థులను చేర్పించిన అంగన్వాడీ కార్యకర్తలు

యద్దనపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని చీరాల డిప్యూటీ ఈఓ ఎమ్. నిర్మల అన్నారు. శుక్రవారం యద్దనపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పెంపొందచటానికి ఉపాధ్యాయులు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవేంద్రరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి..

అద్దంకి రూరల్: బడిఈడు కలిగిన పిల్లలనను బడిలో చేర్పించాలని మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ ఎంపీపీఎస్ హెచ్‌ఎం టి. పురుషోత్తమ్మ అన్నారు. శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పాఠశాల పరిధిలోని పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రమేష్, అంగన్‌వాడీ కార్యకర్త జే. సుమలత పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

మార్టూరు: ఉద్యానశాఖ, ఉపాధి హామీ పనుల గురించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జి నితిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఇటీవల ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవన పంటలకు అనుసంధానం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. వందశాతం రైతుపై రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనున్న ఉద్యానవన పంటల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి బి హనుమంతు నాయక్, ఏవో వీ కిరణ్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి



యూటీఎఫ్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బల్లికురవ: ఈపూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల జీతాల చెల్లింపుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకకోవాలని యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం బల్లికురవ మండలంలో వివిధ పాఠశాలలో క్యాంపెయిన్‌ల ద్వారా ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ భవన నిర్మాణానికి స్థలం కొనుగోలుకు సహకారం అందించాలని ఉపాధ్యాయులను కోరారు. యూటిఎఫ్ ఏర్పడి 5 దశాబ్దాలు పూర్తి అయిన సందర్భంగా డిసెంబర్‌నెల 14, 15,16,17తేదిలో కాకినాడలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ బాధ్యులు పి రామాంజనేయులు, డీ శేషగిరి, చంటి శ్రీనివాసరెడ్డి, గాలం వీరాంజనేయులు, భాస్కర్‌రావు, పెద్దబ్బాయి, శ్రీకాంత్, అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా సోకకుండా జాగ్రత్తలు



రోగిని పరీక్షించి మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: కలుషిత నీరు, అపరిశుభ్రత వలన డయేరియా సోకే ప్రమాదం ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ. రవితేజ కోరారు. శుక్రవారం పెద అంబడిపూడి గ్రామంలో 104 వైద్యశిబిరంలో భాగంగా షుగరు, బీపి, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాల సీజన్ ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పరిశుభ్రతపై కూడా తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించనున్నట్లు వైద్యాధికారి వివరించారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణం



వెంకటేశ్వరస్వామి దివ్యకల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల వెంటేశ్వరస్వామి దేవస్థానం 40వ వార్షిక బ్రహోత్సవాలు ముగిశాయి. బ్రహోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం స్వామి వార్ల దివ్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరిచి వేడుకగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ వేడుక సందర్భంగా గ్రామంలోని నాభిశిల వద్ద పూజారులు, భక్తులు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో గ్రామోత్సం నిర్వహించారు.

బడ్జెట్ తీర్మానానికి కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ



సభలో అధికారులు, కౌన్సిలర్లు

అద్దంకి: పట్టణ మునిసిపల్ బడ్జెట్ 2024–25కు సంబంధించిన బడ్జెట్ తీర్మానాన్ని మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా అమోదించింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం చైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అధ్యక్షతన మునిసిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో 25 అంశాల ఎజెండాను ఆర్ఐ అర్జునరావు చదివి వినిపించగా కౌన్సిల్ ఆమోదంతో చైర్‌పర్సన్ అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించింది. 54 అంశాలకు సంబంధించిన ఈ బడ్జెట్ వ్యయంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌సర్పన్, కౌన్సిలర్ల వేతనాలు, టెలిఫోన్ చార్జిలు, మొబైల్ చార్జీలు, కంప్యూటర్ విడిభాగాలు, ప్రకటనల ఖర్చులు తదితరాలకు సంబంధించి 65 అంశాలున్నాయి. అదే విధంగా కమిషనర్‌కు అద్దె ప్రాతిపదికన వాహనాన్ని కేటాయించుట, సాధారణ ఎన్నికల సమయంలో విగ్రహాలకు ముసుగులు వేయుట, అనధికార ఫ్లెక్సీల తొలగింపు తదితరాలకు సంబంధించిన ఖర్చులకు ఆమోదం తెలిపారు.

నూతన ప్రభుత్వానికి టీడీపీ సభ్యుల అభినందనలు..

అజెండాలోని అంశాలు ముగిసిన తరువాత టీడీపీ కౌన్సిలర్లు నూతన ప్రభుత్వ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కే పవన్‌కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అభినందనలు తెలియజేశారు. అయితే ఆ సమయానికి వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు అంశాలన్నీ ఆమోదిస్తున్నట్లు ప్రకటించి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. సమావేశంలో వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కమిషనర్ సత్యనారాయణ, మేనేజర్ శ్రీదేవి, టీపీవో సాంబశివరావు, ఆర్ఐ అర్జునరావు, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



కొరిశపాడులో పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ విజయకుమార్



పలకలు చూపిస్తున్న గిరిజన విద్యార్థులు

జే.పంగులూరు: రామకూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామకూరు గ్రామంలోని గిరిజన విద్యార్థులకు శుక్రవారం పలకలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్ నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీరు దంపతులైన భాను ప్రకాష్, రాజ్యలక్ష్మి దంపతుల సాయంతో రామకూరు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామ పెద్దం మానం హరిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొత్తూరు ప్రసాద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: విద్యార్థుల కోసం ప్రభుత్వం అందచేస్తున్న లబ్దిని సద్వినియోగం చేసుకోవాలని కొరిశపాడు సర్పంచ్ విజయకుమార్ అన్నారు. మండల కేంద్రం కొరిశపాడులో జగ్జీవన్‌రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు, టెక్స్‌బుక్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీకృష్ణ, టీచర్ సుభాషిణి పాల్గొన్నారు.

పట్టపగలే దొంగల హల్‌చల్



దొంగలు పగులగొట్టిన బీరువాని చూపిస్తున్న నాగేంద్రమ్మ

జే.పంగులూరు: పట్టపగలే దొంగల హల్‌చల్ చేసి రెండిళ్లలో బంగారం, నగదు దోచుకుపోయారు. బాధితుల వివరాల మేరకు.. మండలంలోని ముప్పవరం గ్రామంలోని దొడ్డ నాగేంద్రం స్థానికంగా ఉన్న పొగాకు కంపెనీలో రోజువారి కూలీగా పనిచేస్తూ ఉంటుంది. ఉదయం 9 గంటలకి ఇంట్లో పనులు ముగించుకొని కంపెనీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి రావడంతో ఇంట్లోని సామానంతా చిందరవందరగా పడి ఉంది. బీరువా పగల గొట్టి ఉండటం చూసి బావురు మంది. ఇంటి వెనుక వైపు తలుపు గడి తీసుకొని ఇంట్లో ప్రవేశించి దొంగలు ఇంట్లో ఉన్న బీరువాను పగల గొట్టి అందులో ఉన్న రూ.45 వేలు నగదు, రెండు ఉంగరాలు తీసుకొని వెళ్లినట్లు నాగేంద్రం తెలిపింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపంది. ఇదే గ్రామానికి చెందిన జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న తిరుమల శెట్టి వినోద్ కుమార్ ఇంట్లో కూడా దొండలు పడ్డారు. అల్మారలో దాచిన రూ. 17 వేలు నగదు దోచుకొని పోయారు. ఈ విషయమై వినోద్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపాడు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మలేరియా నివారణ మాసోత్సవం జరుపుతున్న అధికారులు

జే.పంగులూరు: మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మలేరియాను పారదోలేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలని, పంగులూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం సూపర్‌వైజర్ షేక్ మదర్‌షా అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని బూదవాడ గ్రామంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మదర్‌షా మాట్లాడుతూ మలేరియా మసోత్సవం జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలన్నారు. కొబ్బరి బోండాలు, డబ్బాలు, రోలు, తొట్లు, కూలర్లు, వాడి పడేసిన డబ్బాలు, కుండీలల్లో నీరు నిలువకుండా చూసుకోవాలని చెప్పారు. మలేరియా నిర్మూలన మన అందరి బాధ్యతని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బంగారుకొండ అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ ఓ స్వప్న లత, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ

మార్టూరు: మండలంలో జూలై ఒకటో తేదీన 10086 మంది వివిధ రకాల పెన్షన్ దారులకు సచివాలయాల సిబ్బంది ద్వారా లబ్దిదారుల ఇంటి వద్దనే పెన్షన్లు పంపిణీ చేయడం కోసం రంగం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో జి నితిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ప్రభుత్వం పెంచిన రూ.4 వేల పెన్షన్లు ఏప్రిల్ మే జూన్ నెలల నుంచి అమలయ్యేలా ఒక్కొక్కరికి రూ.7 వేలు పింఛన్లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. పెన్షన్ల పంపిణీ కోసం ప్రభుత్వం సుమారు రూ.6.9 కోట్లు నిధులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. పెన్షనర్లు ఎవరు ఏ కార్యాలయానికి వెళ్లనవసరం లేదని, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

ఫ్లై ఓవర్ నిర్మాణం కలేనా..?

- కారంచేడు రైల్వేగేటు, ఫైరాఫీసు గేటు వద్ద ఇక్కట్లు
- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
- అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలంటున్న ప్రజానీకం



రైల్వేగేటు మూసివేయడంతో గేటు వద్ద నుంచి చిన్న రథం సెంటర్ వరకు నిలిచిపోయిన వాహనాలు

చీరాల రూరల్: చీరాలలోని రైలు పట్టాల అవలనున్న ప్రజానీకం ఫైరాఫీసు రైల్వేగేటు, కారంచేడు గేటు వలన తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది ద్వి చక్రవాహనాలు, ఆటోలు, లారీలు ఇతర వాహనాలు ప్రయాణించే ఈ గేట్లు రైళ్ల రాకపోకలతో నిత్యం మూసే ఉంటున్నాయి. అంతేకాక ఈ మధ్య రైల్వేశాఖ కొత్తగా మూడో లైను కూడా నిర్మించింది. దీంతో ప్రజానీకానికి మరింత కష్టాలు పెరిగిపోయాయి.

సగానికి జనాభా రైలు పట్టాల ఆవలే..

చీరాల పట్టణంలోని జనాభాలో సగానికిపైగా జనాభా రైలు పట్టాల ఆవల నివాసముంటున్నారంటే అతిశయోక్తికాదు. చీరాల పట్టణంలో 33 మున్సిపల్ వార్డులు ఉండగా వాటిలో సగానికిపైగా వార్డులు రైలు పట్టాల ఆవల ఉన్నాయి. ఈ ప్రాంతాలలో నివాసటుంటున్న జనాభా పట్టణంలోకి రావాలంటే ఫైరాఫీసు గేటుకానీ, కారంచేడు రైల్వేగేటు కానీ దాటాల్సిందే. గతంలో రెండు రైల్వే లైన్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం రైల్వేశాఖ మూడో లైనుకూడా ఏర్పాటు చేసింది. ఈ లైన్‌పై కూడా రైళ్లు నిత్యం పరుగులు పెడుతున్నాయి. దీని వలన ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. రైలు పట్టాల ఆవల ఎక్కువగా కూలీ పనులు చేసుకునేవారే అధికంగా ఉన్నారు. చిరుద్యోగులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఉన్నారు. వారందరూ సమయానికి వెళ్లాలంటే ఈ రైల్వేగేట్లు దాటాల్సిందే.

బ్రిడ్జిల నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు..

ఈ రెండు రైల్వేగేట్లు ఉన్న ప్రాంతాలలో ట్రాఫిక్ కష్టాలు నివారించేందుకు గతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ముఖ్యంగా ఫైరాఫీసు గేటువద్ద బ్రిడ్జి నిర్మించేందుకు అధికారులు మార్కింగులు కూడా ఇచ్చారు. ఫైరాఫీసు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజి మధ్యలో నుంచి వైకుంఠపురం మీదుగా దండుబాటకు వెళ్లే విధంగా రూటును సిద్ధం చేశారు. అయితే ఆ ప్రతిపాదనలు ఎందుకు నిలిచిపోయాయో అధికారులకే తెలియాలి. రైలు పట్టాల ఆవలే శ్మశాన వాటికలు కూడా ఉండడంతో మరింత కష్టాలు పెరిగాయి. మృతి చెందినవారిని తీసుకెళ్లాలంటే ఫైరాఫీసు గేటు దాటాల్సిందే. గేటు మూసివేసిన సమయంలో గేటు తెరచే వరకు మృత దేహాలను అక్కడే నిలిపేయాల్సిన పరిస్థితి దాపురించింది. అలానే కారంచేడు రైల్వేగేటు వద్ద మరింతగా ట్రాఫిక్ కష్టాలు వెన్నాడుతున్నాయి.

పట్టని అధికారులు..

ఈ ప్రాంతంలో పట్టణంలో నుండి కారంచేడు, పర్చూరు, నరసనరావుపేటకు వెళ్లే వాహనాలు అధికంగా ఉంటాయి. అలానే ఆయా ప్రాంతాల నుంచి పట్టణంలోని వచ్చే వాహనాలు కూడా అంతే సమానంగా ఉంటాయి. రైల్వేగేటు మూసివేసిన సమయంలో గేటుకు రెండువైపులా వాహనాలు బారులుతీరి ఉంటాయి. ఇక స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతం సమయానికి చేరుకోలేక నానా అవస్థలు పడుతున్నారు విద్యార్థులు. ఈ గేటు ప్రాంతంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడతారనే ప్రచారం ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఫైరాఫీసు గేటు, కారంచేడు రైల్వేగేట్ల వద్ద బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి ప్రజలు, వాహనదారుల కష్టాలు తీర్చాలని వేడుకొంటున్నారు.

రహదారులపై ఆవులను వదిలితే చర్యలు



సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల అర్బన్: రహదారులపై ఆవులను విడిచిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య మేస్త్రీలు, నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు, ఎలక్ట్రికల్ సిబ్బంది, ఫిట్టర్లతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య మేస్త్రీలకు ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. వార్డు ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల ద్వారా ఆవుల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. నోటీసులు జారీ చేసినా స్పందించకుంటే ఆవులను గోశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఆవులను రహదారులపై వదలడం వలన ప్రమాదాలు జరిగాయన్నారు. డివైడర్లపై ఉన్న నీటి మోటార్లను, పైపులైన్లను తనిఖీ చేసి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు.